| Published Date: | 22 Aug 2018 | Publication: | Eenadu (Telugu) |
|---|---|---|---|
| Edition: | Chennai | Page No: | 9 |
| MAV/CCM: | 35190/38.25 | Circulation: | 12588 |

# విజేతలు కోటగిరి విద్యార్థులు

**చెన్నై (సాంస్కృతికం), న్యూస్‌టుడే:** టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మంగళవారం నిర్వహించిన ప్రశ్నావళి తుది పోటీల్లో కోటగిరిలోని సెయింట్ జూడ్స్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు యాళిని, హర్షలు విజేతలుగా నిలిచారు. 'టీసీఎస్ ఐటీ విజ్ 2018' పేరిట చెన్నై డివిజన్‌లో అంతర్ పాఠశాలల విద్యార్థులకు (8- 12 తరగతులు) ప్రశ్నావళి పోటీలు నిర్వహించింది. తుది పోటీలు మ్యూజిక్ అకాడమీ వేదికగా ఏర్పాటయ్యాయి. ఇద్దరేసి చొప్పున మొత్తం ఆరు జట్లు పాల్గొనగా క్విజ్ మాస్టర్ గిరి బాలసుబ్రహ్మణ్యం సమాచార సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు అడిగారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నగరంలోని అమెరికన్ కాన్సుల్ జనరల్ రాబర్ట్ జి.బర్గెస్ విజేతలకు ట్రోఫీతోపాటు బంగారు పతకాలు, రూ.60 వేల విలువైన బహుమతి కూపన్లు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన చెట్టినాడు విద్యాశ్రమం విద్యార్థులకు ట్రోఫీతోపాటు రజత పతకాలు, రూ.40 వేలు విలువైన బహుమతి కూపన్లు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మిగిలిన నాలుగు జట్లకు గిఫ్ట్ హ్యాంపర్లు అందజేశారు. టీసీఎస్ చెన్నై వైస్ ప్రెసిడెంట్ సురేష్ రామన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మొత్తం 12 ప్రధాన నగరాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెన్నై డివిజన్ విజేతలను జాతీయ స్థాయిలో జరిగే క్విజ్ పోటీలకు పంపుతామన్నారు. తమ సంస్థ 1999 నుంచి ఐటీ క్విజ్ నిర్వహిస్తోందన్నారు. చెన్నై డివిజన్‌లో జరిగిన పోటీల్లో పుదుచ్చేరి, కాంచీపురం, తేని, తిరువళ్ళూరు, కన్యాకుమారి, నీలగిరి, వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.




**విజేతలతో అమెరికన్ కాన్సుల్ జనరల్, నిర్వాహకులు**

1/1 Back To Index